
ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
శుక్రవారం 9 మే 2025 www.prajaswaramdaily.com 4 pm

# అంబాల.. బ్లాక్ అవుట్

చండీగఢ్ : భారత్ - పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు మరోసారి తీవ్ర స్థాయికి చేరాయి. మరోసారి భారత్, పాక్ మధ్య కాల్పులు, వైమానిక దాడులు చోటుచేసుకుంటున్నాయి. భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో హర్యానాలోని అంబాలలో రోజు బ్లాక్ అవుట్ ప్రకటించారు. ఈ తరుణంలో శుక్రవారం రాత్రి 8 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు బ్లాక్ అవుట్ నిర్వహించాలని అంబాల కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సమయంలో ఇన్వర్టర్లు, జనరేటర్లు, పవర్ బ్యాకప్ పరికరాలు వినియోగించవద్దని సూచించారు. తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు ఇది అమల్లో ఉంటుందని ఆయన వెల్లడించారు. యుద్ధం లేదా అత్యవసర పరిస్థితుల్లో లైట్లు, ఇతర విద్యుత్ ఉపకరణాలను అపేయడాన్ని బ్లాక్ అవుట్ అంటారు.



# గుజరాత్ ముఖ్యమంత్రికి ప్రధాని మోదీ ఫోన్

**ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో ఫోన్‌లో సంభాషణ**

**కచ్, బనస్కంతా, పటాన్, జామ్‌నగర్ జిల్లాల్లో భద్రతా సన్నద్ధతపై ఆరా**

**పౌరుల భద్రతకు తీసుకుంటున్న చర్యల గురించి తెలుసుకున్న ప్రధాని**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భద్రతా సన్నద్ధతపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో ఫోన్‌లో మాట్లాడి తాజా పరిస్థితులపై సమీక్షించారు. పాకిస్థాన్‌తో సుదీర్ఘ సరిహద్దును పంచుకుంటున్న గుజరాత్‌లో భద్రతా ఏర్పాట్లపై భూపేంద్ర పటేల్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా భద్రతా పరంగా అత్యంత సున్నితమైనవిగా పరిగణించే కచ్, బనస్కంతా, పటాన్, జామ్‌నగర్ జిల్లాల్లో ప్రస్తుత పరిస్థితిని, పౌరుల భద్రత నిమిత్తం రాష్ట్ర యంత్రాంగం చేపడుతున్న చర్యలను ప్రధాని అడిగి తెలుసుకున్నారు.

పాకిస్థాన్ నుంచి దాడుల ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఈ సరిహద్దు జిల్లాల్లో అధికార యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా వ్యవహరిస్తోందని, ప్రజలకు ఎప్పటికప్పుడు అవసరమైన సూచనలు జారీ చేస్తోందని ప్రధానికి వివరించారు. మరోవైపు సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం కూడా అప్రమత్తమై కీలక చర్యలు చేపడుతోంది. ఇప్పటికే రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి సమావేశం జరగ్గా ఆర్థిక, హోం, ఆరోగ్య శాఖల మంత్రులు కూడా తమ తమ శాఖల ఉన్నతాధికారులతో వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాల్లో సరిహద్దు రాష్ట్రాల్లో నెలకొన్న వాస్తవ పరిస్థితులు, ఆర్థికపరమైన సన్నద్ధత, ప్రజలకు అవసరమైన ఆరోగ్య సేవల లభ్యత వంటి పలు కీలక అంశాలపై కూలంకషంగా చర్చించారు.





# మౌనం హానిని అంగీకరించదు

## సిందూర్‌పై రష్మిక మందన్న ఆసక్తికర పోస్టు

## భారత సైన్యానికి మద్దతు

హైదరాబాద్ : ప్రముఖ సినీ నటి రష్మిక మందన్న ఒక ఆసక్తికరమైన పోస్టు చేశారు. ఆమె సామాజిక మాధ్యమాల ద్వారా భారత సైన్యానికి తన మద్దతును తెలియజేశారు. రష్మిక మందన్న తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో భారత సైన్యానికి మద్దతుగా పలు పోస్టులను పంచుకున్నారు. రెచ్చగొట్టే చర్యలకు, ఆత్మరక్షణ కోసం అవసరమైన ప్రతిఘటనకు మధ్య ఉన్న నైతిక విలువల గురించి ప్రస్తావిస్తూ ఒక పోస్ట్‌ను ఆమె రీషేర్ చేశారు. "శాంతిని కోరుకోవడం అంటే నిశ్శబ్దంగా ఉంటూ హానిని అంగీకరించడం కాదు" అని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న వారిని ప్రశ్నించాలని ఆమె అభిప్రాయపడ్డారు. మరొక స్టోరీలో, నైజీరియన్ రచయిత్రి చిమామండ అడిచే ప్రసంగానికి సంబంధించిన వీడియోను రష్మిక పంచుకున్నారు. ఎల్లప్పుడూ మంచిగా ఉండటం ద్వారా ప్రపంచాన్ని మెరుగ్గా మార్చలేమనే భావాన్ని ఆ వీడియో తెలియజేసింది. "దయతో ఉండండి. కానీ అవసరానికి మించి మంచిగా ఉండకండి" అనే వ్యాఖ్యతో ఆమె ఆ వీడియోను షేర్ చేశారు. ఈ పోస్టుల ద్వారా దేశ రక్షణ చర్యలకు తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు.

# ఐపీఎల్ వాయిదా

**భారత్ పాక్ ఉద్రిక్తల నేపథ్యంలో..**

**విదేశీ ఆటగాళ్ల భద్రత ముఖ్యమన్న చైర్మన్ శుక్లా**

**లీగ్ దశలో ఇంకా 12 మ్యాచ్‌లు**

న్యూఢిల్లీ : భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పరిస్థితుల్లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 నిర్వహించడం సరికాదని నిర్ణయించింది. ఐపీఎల్ లీగ్ ను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. శుక్రవారం ఉదయం జరిగిన సమావేశంలో వాయిదా నిర్ణయం తీసుకున్నట్లు బీసీసీఐ తెలిపింది. ఐపీఎల్ లీగ్ దశలో భాగంగా ఇంకా 12 మ్యాచ్‌లున్నాయి. లఖ్‌నవ్, హైదరాబాద్, అహ్మదాబాద్, ఢిల్లీ, చెన్నై, బెంగళూరు, ముంబయి, జైపూర్ నగరాలు ఈ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంది. గురువారం హిమాచల్ ప్రదేశ్ లోని ధర్మశాలలో పంజాబ్, ఢిల్లీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ భద్రతాకారణాలరీత్యా అర్ధాంతరంగా ఆగిపోయిన విషయం తెలిసిందే. టోర్నీలో ఆడుతున్న విదేశీ ఆటగాళ్ళు భద్రతపై ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో బీసీసీఐ సమావేశం నిర్వహించినట్లు తెలుస్తోంది. అంతకుముందు బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా స్పందిస్తూ.. "పరిస్థితిని బట్టి టోర్నమెంట్ భవిష్యత్తుపై శుక్రవారం నిర్ణయం తీసుకుంటాం. అన్నింటికన్నా ఆటగాళ్ల భద్రత ముఖ్యం" అని పేర్కొన్నారు.



# యుద్ధంపై చైనా రియాక్షన్ ఇదే

బిజింగ్: భారత్-పాక్ మధ్య యుద్ధంపై చైనా తాజాగా స్పందించింది. ఈ పరిణామంతో ఆందోళన చెందుతున్నట్లు పేర్కొంది. సరిహద్దు దేశాలలో శాంతి నెలకొనాలని ఆకాక్షించింది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించేందుకు అంతర్జాతీయ సమాజంతో పనిచేస్తామని పేర్కొంది. ఈమేరకు చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు.

# షరీఫ్ ప్రభుత్వాన్ని ఎండగడుతున్న పాక్ ఎంపీలు!

**షెహబాజ్ పిరికివాడని, భారత ప్రధాని పేరు చెప్పడానికే భయపడుతున్నారని విమర్శ**

**ఓ ఎంపీ .. రక్షించు అంటూ దేవుడిని వేడుకున్నారు**

న్యూఢిల్లీ : భారత్ నుంచి దాడుల భయంతో పాకిస్థాన్ అల్లాడుతుండగా, స్వదేశంలోనూ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పడం లేదు. ఒకవైపు సరిహద్దుల్లో ఉద్రిక్తతలు, మరోవైపు ఇమ్రాన్ ఖాన్ పార్టీ పీటీఐ కార్యకర్తల నిరసనలు ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ తరుణంలో, పాకిస్థాన్ పార్లమెంటు సభ్యుడు షాహిద్ అహ్మద్, ప్రధాని షెహబాజ్ షరీఫ్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. షెహబాజ్‌ను 'పిరికివాడు'గా అభివర్ణించిన ఆయన, భారత ప్రధాని మోదీ పేరును ప్రస్తావించడానికి కూడా తమ ప్రధాని భయపడుతున్నారని తీవ్ర విమర్శలు చేశారు. సరిహద్దుల్లో సైనికులు ధైర్యం కోరుకుంటున్నారని, కానీ ప్రధాని స్వయంగా పిరికివాడై, మోదీ పేరును కూడా ఉచ్చరించలేకపోతే, ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న వారికి ఎలాంటి సందేశం పంపుతున్నామని షాహిద్ అహ్మద్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన టిప్పు సుల్తాన్ చెప్పిన ఓ సూక్తిని ఉటంకించారు. "సింహాల సైన్యాన్ని నక్క నడిపిస్తే, వారు పోరాడలేరు, యుద్ధంలో ఓడిపోతారు" అని షాహిద్ అహ్మద్ వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలు పాకిస్థాన్ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి.

ఇటీవల, మరో ఎంపీ తాహిర్ ఇక్బాల్ కన్నీళ్లు పెట్టుకుని, "యా ఖుదా, ఆజ్ బచా లో" (ఈ భారత్ మమ్మల్ని వదిలేలా లేదు... దేవుడా, ఈ రోజు మమ్మల్ని రక్షించు) అని ప్రార్థిస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దేశంలో నెలకొన్న అశాంతి, భద్రతాపరమైన ఆందోళనల నేపథ్యంలో ఆయన దేవుడిని వేడుకున్నారు.



పాకిస్తాన్ ప్రధాని భవనం